నేడు కొమురవెల్లి మల్లన్న 4వ ఆదివారం

చేర్యాల, ఫిబ్రవరి 8: కొమురవెల్లి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు 4వ ఆదివారం కావడంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. పట్నం, లష్కర్‌వారాలతో పాటు 3వ ఆదివారాల సందర్భంగా హైదరాబాద్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. పట్నం వారానికి సుమారు 50వేలకు పైగా భక్తులు రానున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులు మల్లన్నను దర్శించుకోవడంతో పాటు పట్నం వేసి బోనం సమర్పించుకోనున్నారు. మహా మండపం, గంగరేగు చెట్టు ఆవరణలో పట్నాలు వేయనున్నారు. మల్లన్న గుట్టపైన ఎల్లమ్మకు, కొండపోచమ్మ, నల్లపోచమ్మ అమ్మవార్లకు బోనాలు సమర్పించనున్నారు. భక్తుల కోసం ఆలయ ఈవో రామాంజనేయులు, పాలక మండలి సభ్యులు, అధికారులు, సిబ్బంది వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి

చిన్నకోడూరు, ఫిబ్రవరి 8: చిన్నకోడూరు గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో భీష్మ మహర్షి ఏకాదశిని గంగపుత్రులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కులపెద్దలు భీష్మ మహర్షి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గుడిసె లక్ష్మణ్ మాట్లాడుతూ గంగపుత్ర జాతి కోసం భీష్మ మహర్షి ఎన్నో త్యాగాలు చేశారన్నారు. కార్యక్రమంలో పంపరి కనకయ్య, కనుగుల లక్ష్మయ్య, రమేశ్, నర్సింలు, గుడిసె భిక్షపతి, లక్ష్మణ్, దానయ్య, లింగం, మహిళ అధ్యక్షురాలు వినోద, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరులో భీష్మ మహర్షి చిత్రపటానికి గంగపుత్రుల నివాళి

4.3 కిలోల శిశువు జననం

అధిక బరువుతో జన్మించిన శిశువు

హుస్నాబాద్, ఫిబ్రవరి 8: హుస్నాబాద్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో అధిక బరువు గల శిశువు శనివారం జన్మించాడు. 4కిలోల 300 గ్రాముల బరువున్న బాలుడు జన్మించడంతో బాల భీముడు జన్మించాడని పలువురు పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని కేబీ కాలనీకి చెందిన ఎస్‌కే ముంతాజ్ ఈ పండంటి శిశువుకు జన్మనిచ్చింది. ఆమె మొదటి నుంచి ఇదే దవాఖానలో పరీక్షలు చేయించుకోగా, సరైన వైద్యం అందించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రసవం చేసిన వైద్యులు డాక్టర్ ప్రసన్న, డాక్టర్ రాఘవేంద్ర, నర్సులు సృజన, హారికలను దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్‌రెడ్డి అభినందించారు. ముగ్గురి ఆడపిల్లల సంతానం అనంతరం నాలుగో సంతానంగా అధిక బరువుగల బాబు పుట్టడంతో ముంతాజ్‌తో పాటు ఆమె భర్త రహీమ్, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

సిద్దిపేట అర్బన్: మాట్లాడుతున్న నిర్వాహకులు

నేడు క్రికెట్ టోర్నీ ప్రారంభం

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 8: మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామంలో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 9 నుంచి 17వ తేదీ వరకు క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు యాదగిరి, శ్యామ్, శ్రీనివాస్‌లు తెలిపారు. శనివారం మిట్టపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా టోర్నీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నీలో మండల వ్యాప్తంగా 12 గ్రామాల నుండి 30 టీమ్‌లు పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రారంభ, ముగింపు కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరవుతారని తెలిపారు. విజేతలకు నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో రాము, సంతోష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నంగునూరు: డ్రా తీస్తున్న టోర్నీ నిర్వాహకులు

నంగునూరులో..

నంగునూరు, ఫిబ్రవరి 8: నంగునూరు మండల కేంద్రంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పుట్టినరోజు పురస్కరించుకొని ఈనెల 9 నుంచి 17వ తేదీ క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్టు టోర్నీ నిర్వాహకులు ఆకుబత్తిని రాము, సిద్దు, పరశురాములు, రమేష్, గపూర్, చింటు గౌడ్, ఇమ్రాన్‌లు శనివారం తెలిపారు. తమ అభిమాన నాయకుడు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా కేసీఆర్ అభిమానులు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అభిమానులు టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టోర్నీలో మండల వ్యాప్తంగా 46 టీమ్‌లు పాల్గొంటున్నట్లు తెలిపారు. నంగునూరు మండలంలోని క్రీడాకారులు పాల్గొనాలని వారు కోరారు.

న్యూరో సర్జన్ తిరుమల్‌కు అరుదైన గుర్తింపు

తిరుమల్

దుబ్బాక, ఫిబ్రవరి 8: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటకు చెందిన డాక్టర్ ఎరగుంట తిరుమల్ న్యూరో సర్జన్‌కు అంతర్జాతీయ సదస్సులలో పాల్గొనే అరుదైన అవకాశం లభించింది. తిరుమల్ నిమ్స్ (నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) హైదరాబాద్‌లో అదనపు న్యూరో సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. న్యూరో సర్జరీ నైపుణ్యాలతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా ఆయనకు అంతర్జాతీయ సదస్సుల నుంచి ఆహ్వానాలు అందాయి. ఈనెల 13 నుంచి 17 వరకు శ్రీలంకలో నిర్వహించనున్న న్యూరోసర్జన్స్ అసోసియేషన్ వార్షిక సమావేశంలో, అలాగే మే 11 నుంచి 14 వరకు లండన్‌లో జరుగబోయే మూరోపియన్ సోసైటీ ఫర్ పీడియాట్రిక్ న్యూరోసర్జరీ (ఈఎస్‌పీఎన్) 29వ వార్షికోత్సవంలో ప్రదర్శన ఇవ్వనున్నారు. డాక్టర్ తిరుమల్‌కు అరుదైన కీర్తి సాధించడంపై ఆయన తల్లిదండ్రులు సుజాతా, ప్రసాద్, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

గీతా పారిశ్రామిక సహకార సంక్షేమ సంఘం ప్రమాణ స్వీకారం

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 8: గీతా పారిశ్రామిక సహకార సంక్షేమ సంఘ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తానని సంఘం నూతన అధ్యక్షుడు పల్లె లాల్‌బాహుదూర్ గౌడ్ స్పష్టం చేశారు. ఇటివల సిద్దిపేట గీతా పారిశ్రామిక సహకార సంక్షేమ సంఘం ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. ఈ మేరకు నూతన కార్యవర్గం శనివారం కొలువు దీరింది. అధ్యక్షుడు పల్లె లాల్‌బాహుదూర్ గౌడ్, ఉపాధ్యక్షునిగా మార్క శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శిగా పల్లె బాలకిషన్‌గౌడ్, కోశాధికారిగా గదగోని కిష్టయ్యగౌడ్, డైరెక్టర్లుగా గాదగోని సత్యంగౌడ్, పల్లె జ్యోతి, బాలగోని బుచ్చవ్వలు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

చెడు వ్యసనాల బారిన పడకూడదు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 8: విద్యార్థులు చెడు వ్యసనాల బారినపడవద్దని మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ అన్నారు. శనివారం మద్దూరు మండలంలోని సలాఖపూర్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శనిగరం చంద్రయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సైబర్ మోసాలు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, గంజాయి, మత్తు పదార్థాలు, ఈవ్‌టీజింగ్, నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు పంపించే లింక్‌లను ఓపెన్ చేయకూడదన్నారు. బాల్య వివాహాల వల్ల భవిష్యత్‌లో అనేక అనర్థాలు ఏర్పడుతాయన్నారు. మన చుట్టూ జరుగుతున్న నేరాలపై పోలీసులకు డయల్ 100 ద్వారా సమాచారాన్ని అందించాలన్నారు.

సేద్య పరిశీలన తెలంగాణ వ్యవసాయ గ్రంథం ఆవిష్కరణ

గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ నర్సింహులు, ప్రొఫెసర్ కోదండరాం తదితరులు

మిరుదొడ్డి, ఫిబ్రవరి 8: మండలంలోని లక్ష్మీనగర్‌కు చెందిన డాక్టర్ ఎల్.నర్సింహులు తాను రచించిన 'సేద్య పరిశీలన-మెదక్ తెలంగాణలో వ్యవసాయ అభివృద్ధి' అనే గ్రంథాన్ని శనివారం ఆవిష్కరించారు. నల్లగొండలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన తెలంగాణ 9వ ఆర్థిక సంఘం సమావేశంలో ఎమ్మెల్సీ తీలక్ ఖాజా అలీతాఫ్ హుస్సేన్, ప్రొఫెసర్ కోదండరాం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసపూరిత హామీలను ఎండగట్టాలి

కొమురవెల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ముస్త్యాల బాలనర్సయ్య

చేర్యాల: మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు

- బీఆర్ఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి ముస్త్యాల బాలనర్సయ్య
- బీఆర్ఎస్ స్థానిక సంస్థల సన్నాహక సమావేశం

కొమురవెల్లి, ఫిబ్రవరి 8: కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీఆర్ఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి ముస్త్యాల బాలనర్సయ్య అన్నారు. శనివారం మండలంలోని కిష్టంపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ స్థానిక సంస్థల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నా పేదలకు ఏ ఒక్క సంక్షేమ పథకం అందిన దాఖలాలు లేవన్నారు. కేవలం ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా 420 హామీలు ఇచ్చి వాటిలో ఒక్కటైన సంపూర్ణంగా అమలు చేసింది లేదని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే పథకాలు ప్రారంభిస్తామని మరోసారి మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తుందన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను బీఆర్ఎస్ శ్రేణులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ బీమనపల్లి కరుణాకర్, మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, బీఆర్ఎస్ జిల్లా నాయకులు తలారి కిషన్, బొంగు రాజేందర్‌రెడ్డి, యూత్ ఇన్‌చార్జి అంజయ్య, పచ్చిమడ్ల మానస, మంచాల కొండయ్య, మాజీ ఉపసర్పంచ్ మాదిపల్లి ఐలయ్య, బొంగు నాగిరెడ్డి, బొంగు తిరుపతిరెడ్డి, కొడిసెల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నేరవేర్చాలి

చేర్యాల, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు 6 గ్యారంటీలు, 420 హామీలను ఇచ్చిన కాంగ్రెస్ గద్దెనెక్కి వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నదని, వెంటనే వాటిని అమలు చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని కాశేగుడిసెలలో శనివారం బీఆర్ఎస్ స్థానిక సంస్థల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేయడంతో పాటు 420 హామీలను సైతం నేరవేరుస్తామని సీఎం రేవంత్ ప్రజలకు మాయమాటలు చెప్పి వాటిని అమలు చేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నట్లు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేటిగడ్డ బరాజ్‌ను ఎండబెట్టడడంతో పలు జిల్లాలో భూగర్భ జలమట్టాలు పడిపోయాయని తెలిపారు. కక్షపూరిత రాజకీయాలు చేస్తూ పోలీసులతో బెదిరింపులకు గురిచేస్తూ పాలన సాగిస్తామంటే ప్రజలు ఒప్పుకోరని, రానున్న స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి తగు విధంగా బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గ్రామాలను అభివృద్ధి చేయడంతో పాటు తన స్వంత దవాఖానలో ఉచితంగా నియోజకవర్గ ప్రజలకు వైద్యం అందిస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో గ్రామశాఖ అధ్యక్షుడు షేక్ కమల్, కొమురవెల్లి మల్లన్న ఆలయ మాజీ డైరెక్టర్ పచ్చిమడ్ల సిద్దిరాములు, నాయకులు ఎస్‌కే సుభాన్, ఎస్‌కే మదర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సత్తాను చాటిచెప్పాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 8: స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ సత్తాను చాటి చెప్పాలని బీఆర్ఎస్ మద్దూరు, ధూళిమిట్ట మండల శాఖల అధ్యక్షులు మేక సంతోశ్‌కుమార్, మంద యాదగిరి అన్నారు. శనివారం మద్దూరు మండలంలోని సలాఖపూర్, ధర్మారం, ధూళిమిట్ట మండలంలోని హనుమతండాలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ శ్రేణులు కష్టపడి పనిచేస్తే బీఆర్ఎస్ విజయం ఖాయమన్నారు. సమావేశాలలో మాజీ వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, బీఆర్ఎస్ క్లస్టర్ ఇన్‌చార్జిలు ముస్త్యాల బాల్‌నర్సయ్య, అంకుగారి శ్రీధర్‌రెడ్డి, పుర్మ వెంకట్‌రెడ్డి, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, శివగారి అంజయ్య, పచ్చిమడ్ల మానస, మాజీ సర్పంచ్‌లు వంగ భాస్కర్‌రెడ్డి, ఊట్ల రవీందర్‌రెడ్డి, జాటోత్ రేణుకాఖల్‌రాం, మాజీ ఎంపీటీసీ సూర్న ఐలయ్య, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు గూడ రవీందర్‌రెడ్డి, కొమురవెల్లి ఆలయ మాజీ డైరెక్టర్ శెట్టె ఐలయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, వెంకట్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: సలాఖపూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ధూళిమిట్ట: హనుమతండాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

- జిల్లా కలెక్టర్ మనుచౌదరి

మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 8: పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ పనులను మార్చి చివరి కల్లా పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పంచాయతీరాజ్ శాఖ చేపడుతున్న పనులపై పంచాయతీరాజ్, డీఆర్డీవో శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్ఆర్‌జీఎస్ కింద చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ, అంగన్‌వాడీ భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. ప్రజలు ఇబ్బంది పడుతున్న ప్రాంతాలను గుర్తించి మొదటి ప్రాధాన్యతగా పనులు చేపట్టాలని సూచించారు. ఇది వరకు పూర్తయిన పనులకు ఎఫ్‌టీఓ జనరేట్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎన్ఆర్‌జీఎస్‌లో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే డీఆర్డీఓ అధికారులకు తెలిపి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అంగన్‌వాడీ, పాఠశాలలో చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలన్నారు. గ్రామసభలు నిర్వహించి తీర్మానం ప్రకారం స్థానిక కాంట్రాక్టర్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో డీఆర్డీఓ జయదేవ్ ఆర్యా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

ధూళిమిట్ట: స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

మిరుదొడ్డి: అందె జడ్పీ పాఠశాలలో స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 8: మండల కేంద్రమైన ధూళిమిట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి సహచర విద్యార్థులకు పాఠాలను బోధించారు. డీఈవోగా ఎస్.రాహుల్, డిప్యూటీ డీఈవో కె.అమూల్య, ఎంఈవోగా టి.కార్తీక్, హెచ్ఎంగా వైష్ణవి, ఉపాధ్యాయులుగా పలువురు విద్యార్థులు వ్యవహరించారు. అనంతరం సబ్జెక్ట్‌లలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

అందె జడ్పీ పాఠశాలలో..

మిరుదొడ్డి, ఫిబ్రవరి 8: విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. శనివారం అందె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవాన్ని జరుపుకొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై కేసు నమోదు చేయాలి

సిద్దిపేట, ఫిబ్రవరి 8: రెడ్డి సామాజికవర్గం పట్ల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పాలని రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం రంగధాంపల్లి రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు వంగ తిరుమల్‌రెడ్డి ఆధ్వర్యంలో తీన్మార్ మల్లన్నపై కేసు నమోదు చేయాలంటూ త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ సంఘం అధ్యక్షుడు వంగ తిరుమల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సద్ది నాగరాజారెడ్డిలు మాట్లాడారు. మల్లన్న తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు వెంకటేశ్వర్‌రెడ్డి, సుమన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పద్మారెడ్డి, రాజేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఆరుగురి అరెస్ట్

నిందితులను చూపుతున్న పోలీసులు

నంగునూరు, ఫిబ్రవరి 8: గంజాయి కేసులో ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను శనివారం తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని రాంపూర్ క్రాస్ రోడ్ బస్టాండ్ వెనుక కొందరు గంజాయి విక్రయిస్తున్నారన్న అందిన సమాచారం మేరకు రాజగోపాల్‌పేట ఎస్సై ఆసిఫ్ వారిని పట్టుకున్నారు. వీరి వద్ద నుండి 508 గ్రాముల గంజాయి, రెండు బైకులు, రూ. 3600 నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డవారిలో అప్పలాయచెరువు గ్రామానికి చెందిన నాయిని రాజశేఖర్‌రెడ్డి, నాయిని రాంరెడ్డి, జేపీ తండాకు చెందిన గగులోతు ప్రవీణ్, బద్దిపడకు చెందిన అలకుంట్ల రాకేష్, గగులోతు రాజ్‌కుమార్, రంగధాంపల్లికి చెందిన రొంపల్లి నరేశ్ ఉన్నారు. వీరిలో రాజశేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌లు గత కొంతకాలంగా ఆసిఫాబాద్ జిల్లా కెరిమెరి నుంచి సందీప్ అనే వ్యక్తి దగ్గర నుంచి గంజాయి కొనుగోలు చేసి ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారని తెపారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 8: ధూళిమిట్ట మండల కేంద్రంలోని రైతువేదికలో చిన్నారుల అభివృద్ధిపై 'రిలయన్స్ ఫౌండేషన్, ఖైర్ ఆర్గనైజేషన్'ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు రెండు రోజులుగా కొనసాగుతున్న శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక అధ్యక్షతన నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో బ్లాక్ కోఆర్డినేటర్ నవత, సీఆర్పీ నారదాసు ఉమాదేవిలు ప్రీ స్కూల్ పిల్లలకు పాఠ్యాంశాల సారాంశం అర్థమయ్యే విధంగా ఎలా బోధించాలి అనే అంశంపై వివరించారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జనవికాస ఆధ్వర్యంలో అనాథ పిల్లల దినోత్సవం

చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న లింగమూర్తి

హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 8: హుస్నాబాద్ పట్టణంలో జనవికాస ఆధ్వర్యంలో అనాథ పిల్లల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనాథ పిల్లలకు బట్టలు, పండ్లు, వస్తువులు అందజేసి, కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బాలవికాస వాటర్‌ప్లాంట్ రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి, బాల వికాస కోఆర్డినేటర్లు జ్యోతి, సుజాత, నిర్మల, శ్రీమతి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మల్లికార్జున్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ చిత్తారి పద్మ, మాజీ సర్పంచ్ రమేశ్, రాజు, శ్రీనివాస్, బాలకిష్టయ్య ఉన్నారు.

మత్తు పదార్థాలపై పటిష్టమైన నిఘా

గజ్వేల్, ఫిబ్రవరి 8: గంజాయి ఇతర మత్తు పదార్థాలపై పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేసినట్టు అదనపు సీఐ ముత్యంరాజు తెలిపారు. శనివారం పట్టణంలోని పాన్‌షాప్‌లు, టీకొట్టులు, కిరాణా దుకాణాలు, బేకరీలతో పాటు అనుమానాస్పద ప్రదేశాలలో డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. మత్తు పదార్థాలను ఎవరైనా అమ్మితే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సజావుగా నవోదయ ప్రవేశపరీక్ష

వర్గల్, ఫిబ్రవరి 8: వర్గల్ నవోదయ కేంద్రీయ విద్యాలయ సమితిలో 2025-26వ సంవత్సరానికి 9వ తరగతి, 11వ తరగతిలో ఏర్పడే పరిమిత సంఖ్యల సీట్ల భర్తీకై శనివారం గజ్వేల్‌లో జరిగిన 10 కేంద్రాలలో ప్రవేశ పరీక్షలు సజావుగా జరిగినట్టు వర్గల్ నవోదయ ప్రిన్సిపాల్ డి.రాజేందర్ తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 11వ తరగతి పరీక్ష కోసం 1621 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 1114 మంది హాజరయ్యారని తెలిపారు. 8వ తరగతిలో ప్రవేశం కోసం 989 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 563 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

శివాజీ జయంతిని విజయవంతం చేయాలి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 8: సిద్దిపేటలో ఈనెల 19న జరిగే శివాజీ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని హిందూవాహిని జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్ సత్యం, ప్రధాన కార్యదర్శి బండి కిరణ్, రాష్ట్ర ప్రతినిధులు భూంరెడ్డి, బాల్‌రెడ్డి, ప్రశాంత్‌లు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని శివాజీ చౌక్ వద్ద జయంతి వేడుకల గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ శివాజీ జయంతి రోజున పట్టణంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం నుంచి శివాజీ చౌక్ వరకు భారీ బైక్ ర్యాలీని నిర్వహిస్తామన్నారు. అలాగే బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్టు, సభకు ముఖ్య అథితులుగా భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి, అప్పాల ప్రసాద్ హాజరు కానున్నట్టు తెలిపారు. ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి హిందూ బంధువులు భారీగా తరలిరావాలి కోరారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకుల మృతి

సంఘటనా స్థలంలో చెల్లాచెదురుగా ఉన్న మృతదేహాలు

రాయపోల్, ఫిబ్రవరి 8: రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు మృతిచెందిన ఘటన దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్ గ్రామంలో జరిగింది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన జగన్నాథం కుటుంబం శనివారం శుభాకార్యానికి వెళ్లడానికి సిద్ధమయ్యారు. జగన్నాథం భార్యను బస్సు ఎక్కించి కొడుకు వేణుతో కలిసి తిర్మలాపూర్ నుంచి స్కూటీపై ధరిపల్లికి ప్రయాణమయ్యాడు. ఇందుప్రియాల్, చెట్లనర్సంపల్లి గ్రామాల మధ్య గజ్వేల్-చేగుంట రహదారిపై రోడ్డు దాటుతున్న క్రమంలో గజ్వేల్ నుంచి చేగుంట వైపు వెళ్తున్న లారీ స్కూటీని ఢీకొట్టింది. దీంతో తండ్రీకొడుకులు అక్కడిక్కడే మృత